క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కథలాపూర్: మండలకేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి స్పందన వచ్చిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ శిబిరంలో 75 మందికి కంటి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 42 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి వారిని రేకుర్తి కంటి ఆసుపత్రికి తీసుకెళ్లామని వారు తెలిపారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తాళ్లపెల్లి సతీశ్‌గౌడ్, కార్యదర్శి తిపిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, ట్రెజరీ పూంద్ర జనార్దన్‌రెడ్డి, ప్రతినిధులు మామిడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అల్లె పరమేశ్వర్, ముస్కు శ్రీనివాస్, కొమ్ముల కిషన్‌రెడ్డి, గడ్డం శేఖర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న ఉపసర్పంచ్

కోరుట్లరూరల్: మండలంలోని సంగెం గ్రామంలో అంబేడ్కర్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం ఉపసర్పంచ్ శనిగరపు సాగరిక ప్రారంభించారు. ఈ లైట్లకు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సీడీపీ నిధులు రూ.1.50లక్షలు కేటాయించి ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, వార్డుసభ్యులు కల్లూరు దేవయ్య, దోనె రాజ్‌కుమార్, శనిగరపు లక్ష్మి, ఇల్లెందుల లక్ష్మి, కేతం ప్రశాంత్, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు భూమయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాంచందర్‌రావు, మాజీ సర్పంచ్ గణేశ్, అంబేడ్కర్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మల్యాల: మండల కేంద్రానికి చెందిన పారిశుధ్య కార్మికుడు ఉప్పరి బాలయ్య అనారోగ్యంతో మృతిచెందగా తెలంగాణ యువ చైతన్య ఫౌండేషన్ అధ్యక్షుడు కీసర గణేశ్ రూ.10వేల విరాళాలు సేకరించారు. ఈ మేరకు శుక్రవారం మల్యాల గ్రామంలోని బాలయ్య ఇంటికి వెళ్లి బాధిత కుటుంబానికి ఫౌండేషన్ సభ్యులు నగదు అందజేశారు.

మేడిపల్లిలో గురుకుల నమూనా ప్రవేశ పరీక్ష



పుస్తకం అందజేస్తున్న సర్పంచ్ తిరుపతిరెడ్డి

మెట్‌పల్లి: మండలంలోని మేడిపల్లిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గురుకులాల్లో ప్రవేశానికి సంబంధించిన నమూనా పరీక్షను నిర్వహించారు. కాగా 202 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం వీరందరికీ అంబేడ్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పీసు తిరుపతిరెడ్డితో పాటు వార్డుసభ్యులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ-జమదగ్ని కల్యాణ మహోత్సవం



ఉత్సవాల్లో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్

ధర్మపురి: మండలంలోని నేరెల్ల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని కల్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ముందుగా గౌడ సంఘం ఆధ్వర్యంలో ఇంటింటా బోనాలతో తరలివెళ్లారు. అనంతరం కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎస్‌దినేశ్, సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ, నేరెల్ల గ్రామశాఖ అధ్యక్షుడు కాసారపు బాలాగౌడ్, చిలుముల లక్ష్మణ్, బైరి గణేశ్, నాగేంద్ర, పరశురాం పాల్గొన్నారు.



కోరుట్ల: పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



జగిత్యాలటౌన్: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



జగిత్యాలజోన్: నివాళి అర్పిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత



రాయికల్ : అఖిలపక్షం ఆధ్వర్యంలో నివాళి

రాజ్యాంగ నిర్మాతకు నివాళి

ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ నాయకులు, ప్రజాప్రతినిధులు కోరారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, అంబేడ్కర్ సంఘాల సభ్యులు ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



గొల్లపల్లిలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా బైక్ ర్యాలీ



మల్లాపూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



సారంగాపూర్: రేచపల్లిలో..



పెగడపల్లి: కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు



ధర్మపురి: నక్కలపేటలో..



జగిత్యాలరూరల్: తిమ్మాపూర్‌లో..



కథలాపూర్ మండలం సిరికొండలో..



జగిత్యాలఅగ్రికల్చర్: పరిశోధన స్థానంలో..



మేడిపెల్లి: నివాళి అర్పిస్తున్న నాయకులు

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

జగిత్యాలటౌన్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో శుక్రవారం కవి సమ్మేళనం, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంగాపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రచయిత్రి అయిత అనిత, శ్రీలక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ వివరించాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న మల్లేశ్‌యాదవ్

రాయికల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు ఇంటింటికీ వివరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా అసెంబ్లీ ఇన్‌చార్జి ఆసరి మల్లేశ్‌యాదవ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రాయికల్ పట్టణంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలతో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెడుతున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యులు కుర్మ నారాయణరెడ్డి, మండల నాయకులు సింగని సతీశ్, సంజీవ్, శ్రీకాంత్, మచ్చ నారాయణ, భూమేశ్, రామకృష్ణ, శంకర్, సుదర్శన్, రవి పాల్గొన్నారు.

రోడ్డుపైనే వాకింగ్..!

- జాతీయ రహదారిపై ప్రమాదకరంగా మారిన నడక
- ఆరోగ్యంపై దృష్టిసారిస్తున్న గ్రామస్తులు
- మినీ స్టేడియం, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని డిమాండ్



రోడ్డుపైనే వ్యాయామం చేస్తున్న వాకర్స్

మేడిపెల్లి: మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లతో పాటు కరోనా అనంతరం ప్రజలు దీర్ఘకాలిక వ్యాధులతో పాటు గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. దీంతో ఆందోళనలకు గురై ఆరోగ్యంపై ఎక్కువగా శ్రద్ధ వహిస్తున్నారు. ముఖ్యంగా గ్రామ ప్రజలు వ్యాయామం, యోగా, వాకింగ్, క్రీడలు వంటి వాటిపై ఆసక్తి చూపుతున్నారు. కానీ దానికి తగిన వసతులు, సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు.

సరైన క్రీడా ప్రాంగణం కరువు..

మండల కేంద్రంలో సుమారు 7వేలకు పైగా జనాభా ఉంది. ఇందులో చాలా మంది షుగర్, బీపీతో పాటు పలురకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. దీంతో ప్రతిరోజూ వ్యాయామం, వాకింగ్ వంటి వాటిపై ఆసక్తి చూపుతున్నారు. కానీ మండల కేంద్రంలో మినీస్టేడియం, క్రీడా ప్రాంగణం వంటి సౌకర్యాలు లేక రోడ్లపైనే వాకింగ్, వ్యాయామం చేస్తున్నారు. తెల్లవారుజామున నిజామాబాద్, జగిత్యాల జాతీయ రహదారితో పాటు మేడిపెల్లి, రాయికల్ రహదారిపై ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కు మంటూ వాకింగ్ చేస్తున్నారు. గతంలో వాకర్స్‌పైకి పలు వాహనాలు దూసుకెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. కానిస్టేబుల్, ఎస్సై, ఆర్మీ, నేవీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్న యువకులు సరైన క్రీడా ప్రాంగణం, స్టేడియం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు.

కలగానే మినీ స్టేడియం, మినీ ట్యాంక్‌బండ్

మండల కేంద్రంలో క్రీడాకారుల సౌకర్యార్థం మినీస్టేడియం ఏర్పాటు చేయాలని చాలా రోజులుగా డిమాండ్ వినిపిస్తున్నా.. అది కలగానే మిగిలిపోతోంది. గతంలో ఎన్నికల సమయంలో స్థానిక నాయకులు మేడిపెల్లి ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తామని హామీ ఇచ్చినా నేటికీ నేరవేరలేదు.

వివాదంలో తెలంగాణ క్రీడాప్రాంగణం..

మండల కేంద్రం శివారులో క్రీడాకారుల అభివృద్ధికి తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరిగినప్పటికీ.. స్థల వివాదం కారణంగా బోర్డుకే పరిమితమైంది. శివారు ప్రాంతాల్లో ఎలాంటి ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో వాకర్స్‌తో పాటు క్రీడాకారులకు శాపంగా మారింది. స్థానిక నాయకులు చొరవ తీసుకుని మండల కేంద్రంలో మినీ స్టేడియం, తెలంగాణ క్రీడాప్రాంగణంతో పాటు ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చాలని కోరుతున్నారు.

మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో వాకింగ్ చేసేందుకు మినీస్టేడియం, క్రీడా ప్రాంగణం లాంటి వసతులు లేకపోవడంతో రోడ్లపైనే వాకింగ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వాకర్స్, క్రీడాకారుల కోసం మినీస్టేడియం ఏర్పాటు చేయాలి.

– పోతు గణేశ్, మేడిపెల్లి

ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో..



మినీ స్టేడియం కోసం ఎలాంటి ప్రపోజల్స్ రాలేదు. స్థల వివాదంతో తెలంగాణ క్రీడా ప్రాంగణం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తున్నాం. మండల కేంద్రం శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– వెంకటేశ్‌జాదవ్, ఎంపీడీవో, మేడిపెల్లి

భావితరాలకు స్ఫూర్తిప్రదాత



నివాళి అర్పిస్తున్న డీఎస్పీ ప్రకాశ్

జగిత్యాలక్రైం: భావితరాలకు స్ఫూర్తిప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని డీఎస్పీ ప్రకాశ్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అలర్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని రచించి దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారా ఓటుహక్కు గోప్యతనం, ప్రజలే పాలకులను ఎన్నుకునే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప మేధావి అంబేడ్కర్ అని అన్నారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎ స్పీ రవీందర్‌కుమార్, ఆర్‌ఐలు వామనమూర్తి, నవీ న్, ఆర్‌ఎస్సైలు మల్లేశ్, కృష్ణ, వినోద్‌రెడ్డి, సీసీఎస్ ఎస్సై రవీందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద శిలాఫలకాలు తొలగింపు



విగ్రహం వద్ద శిలాఫలకాలు తొలగింపు

మల్యాల: మండలంలోని తాటిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాలు తొలగించడం కలకలం రేపింది. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు వెళ్లిన నాయకులు శిలాఫలకాలు తొలగించినట్లు గుర్తించారు. అంబేడ్కర్ జయంతి రోజే శిలాఫలకాలు తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ బింగి జ్యోత్స్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. శిలాఫలకాలను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సామాజిక సేవలో ముందుండాలి



చలివేంద్రం ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారి

కోరుట్లటౌన్: సామాజిక సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ ఎం.డీ అయాజ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని నంది చౌరస్తా, గోదాం బస్టాండ్‌లో గుడ్ల ఎర్రన్న స్మారకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ అయాజ్ శుక్రవారం ప్రారంభించారు. ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, చింతామణి ప్రభు, టీఆర్‌ఎస్ యూత్ అధ్యక్ష, కార్యదర్శులు జాల వినోద్, పుప్పాల నాగరాజు, బలిజ శివ, ఎండీ అతిక్, ఎండీ ఆర్బాజ్, ఇక్బాల్, షఫీ, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పశువైద్యశాఖ ఆధ్వర్యంలో..

సారంగాపూర్: మండల కేంద్రంలో శుక్రవారం మండల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ గంగారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ రాంచంద్రారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విగ్రహావిష్కరణకు వెళ్లిన జిల్లా ప్రతినిధులు



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న ప్రతినిధులు



మల్లాపూర్: సభకు వెళ్తున్న లబ్ధిదారులు

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మండలంలోని అధికారులు, అంబేడ్కర్ సంఘ ప్రతినిధులు శుక్రవారం హైదరాబాద్ తరలివెళ్లారు.

దళితబంధు లబ్ధిదారులు..

మల్లాపూర్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 125 ఫీట్ల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ బహిరంగ సభకు గురువారం దళిత నాయకులు, దళితబంధు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన-ఆదిరెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో జగదీష్, రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు ఆదిరెడ్డి, జీవన్ రెడ్డి, నరేశ్, శరత్‌గౌడ్, గంగనర్సయ్య, రమేశ్, రాజేశ్, లింగమూర్తి, రమేశ్ పాల్గొన్నారు.

అర్హత పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

మెట్‌పల్లి: మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే అర్హత పరీక్షకు ఈ నెల 16లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌సీవో గౌతమ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌జేసీ సెట్‌కు ఈ ఏడాది పదో తరగతి, ఆర్‌డీసీ సెట్‌కు ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆదివారంలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఐటీ సెల్ జాయింట్ కన్వీనర్‌గా విఘ్నేష్

కోరుట్ల: పట్టణానికి చెందిన రుద్ర విఘ్నేష్ బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ ఐటీ సెల్ జాయింట్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సురభి నవీన్‌కుమార్ సహకారంతో తన నియామకం జరిగిందని విఘ్నేష్ శుక్రవారం తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలి

మల్లాపూర్: మైనార్టీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి కోరారు. ఈ మేరకు మండలంలోని సిరిపూర్‌లో గురువారం రాత్రి ముస్లింలకు కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం శేఖర్‌రెడ్డి అధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నల్ల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు సోమ నాగార్జున్‌రెడ్డి, రౌతు సాయిలు, గోగుల భూమేశ్, మసీద్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నాగులపేటలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోరుట్లరూరల్: మండలంలోని నాగులపేట గ్రామంలో పాలాస వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం శుక్రవారం మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయ సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం భూసార పరీక్ష నిర్వహణ, సస్యరక్షణ, మందులు పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధ్యాపకులు డాక్టర్ సాయికుమార్, డాక్టర్ శీనివాస్ రైతులకు వివరించారు. ఎస్‌ఎస్‌ఎస్ డాక్టర్ ఎల్లా గౌడ్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ అర్చన, అధ్యాపకులు సంపత్, శ్రీకాంత్, వారియర్స్ యూత్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.